పనిచేయని ఐ-క్లిక్ సెంటర్

- తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో మూలనపడిన వైనం
- ఫిర్యాదిదారులకు సులువైన యంత్రం



తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లోని ఐ-క్లిక్ కేంద్రం

తెనాలిరూరల్: ఏదైనా ఇబ్బందో లేక అవసరమో వచ్చి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే, పోలీసులతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తులను వెంటబెట్టుకుని వెళుతుంటారు. వారు లేకపోతే చాలా సందర్భాల్లో అవసరమైనా సరే సాధారణ ప్రజలు ఠాణా మొహం చూడరు. మోరల్ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరిట ప్రజలకు చేరువయ్యేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నా, ఆశించిన స్థాయిలో ప్రజలకు చేరువ కాలేకపోతున్నారు. ఇటువంటి సమస్యలకు పరిష్కార వేదికగా ఐ-క్లిక్ కేంద్రాలను పోలీస్ శాఖ తీసుకువచ్చింది. పోలీస్‌స్టేషన్లకు వెళ్లాల్సిన పని లేకుండా ఈ ఐ క్లిక్ కేంద్రాలకు వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించింది. సాధారణంగా పోలీసులంటే ఓ చిన్నపాటి భయం, పోలీస్‌స్టేషనంటే ఉండే బెరుకు వల్ల చాలా మంది స్టేషన్లకు వెళ్లరు. అటువంటి వారికి ఈ ఐ-క్లిక్ కేంద్రాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయాలంటే పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లి సీఐ/ఎస్‌ఐను కలిసి ముందు సమస్య చెప్పుకుని, ఆ తరువాత వారి సూచన మేరకు స్టేషను రైటర్‌ను సంప్రదించి, ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అనేక ప్రశ్నలు ఎదురవుతాయి. వాటన్నింటికీ సమాధానం చెప్పుకున్నాక, కేసు నమోదు చేయదగినదేనని అధికారి భావిస్తే అప్పుడు కేసు పెట్టాల్సి ఉంటుంది. అధికారులు / సిబ్బంది వారి పోలీసుల ప్రత్యేక శైలిలో సంధించే ప్రశ్నలంటేనే చాలా మందిలో ఉండే బెరుకు కారణంగా పోలీస్‌స్టేషన్ల వైపు కన్నెత్తి చూడరు. అలాంటి వారు ఈ ఐ-క్లిక్ కేంద్రాలకు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. ఈ కేంద్రాలలోని కియోస్క్(యంత్రం)ల ద్వారా వాయిస్ రికార్డింగ్ ద్వారా, లేదా టైపింగ్ ద్వారా, లేకపోతే కాగితంపై ఫిర్యాదును రాసి దాన్ని స్కాన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.చేసిన ఫిర్యాదు వెంటనే ఆన్‌లైన్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని కంట్రోల్‌రూంకు వెళుతుంది. ఫిర్యాదుదారుకు అవగాహన ఉండి, ఫిర్యాదులోనే సంబంధిత స్టేషనును వివరిస్తే, ఈ కంట్రోల్ రూంలోని సిబ్బంది ఫిర్యాదును సేకరించి, సంబంధిత స్టేషనుకు పంపుతారు. ఐ-క్లిక్ కేంద్రంలో ఫిర్యాదు చేయగానే అక్నాలెడ్జ్‌మెంట్ వస్తుంది.

కేసు నమోదు చేసే వరకు ఎప్పటికప్పుడు కేసు పురోగతిని ఫిర్యాదుదారు సెల్ నంబరుకు తెలియజేస్తారు. ఇక్కడ ఎవరినీ ప్రత్యక్షంగా కలుసుకోవాల్సిన అవసరం ఉండదు. పైగా, తమ పేరు బయటకు రానివ్వద్దని చెబితే, ఆ ప్రకారంగానే ఫిర్యాదును పోలీస్‌స్టేషనుకు ఫార్వార్డ్ చేస్తారు. ఇన్నిప్రయోజనాలున్న ఈ కియోస్క్‌ల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోంది. జిల్లాలో గుంటూరు, మంగళగిరి, తెనాలిలో ఈ కేంద్రాలను ప్రారంభించా రు. ఐ-క్లిక్ కేంద్రాల్లోని యంత్రాలను వినియోగించడం అందరికీ చేతకాదు.

అందువల్ల ఇక్కడ సిబ్బందిని అందుబాటులో ఉంచేవారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికి వీరు సహాయపడుతుండే వారు. ప్రస్తుతం ఈ కేంద్రాల నిర్వహణ గురించి పట్టించుకున్న నాథుడే లేడు. తెనాలి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కియోస్క్ మూలనపడింది. 2016 జులైలో అప్పటి రాష్ట్ర డీజీపీ జేవీ రాముడు ప్రారంభించారు.

తొలినాళ్లలో ఇక్కడ సిబ్బంది అందుబాటులో ఉండే వారు. రానురాను సిబ్బందికి ఇక్కడ డ్యూటీ లేకుండా చేశారు. ఇక యంత్రం ఉపయోగించే వారు కరువయ్యారు. ఇక్కడి యంత్రానికి విద్యుత్ కనెక్షనును సైతం తొలగించేశారు. ఆది నుంచి అంతంత మాత్రంగానే ఆదరణ ఉన్న ఈ కేంద్రాలపై పోలీసు అధికారులు ప్రజలకు మరింత అవగాహన కల్పించి, వినియోగంలో ఉంచినట్టయితే స్టేషన్లకు తాకిడి తగ్గేదన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఇటువంటి కేంద్రాలను పునరుద్ధరించడంతో పాటు, మరి కొన్నింటిని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు పావులూరి ట్రస్ట్ వార్షికోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన పావులూరి ట్రస్ట్ 17వ వార్షికోత్సవం శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలో గల ఏపీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటర్‌లో జరగనుంది. ఉదయం 10 గంటలకు డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన ఏర్పాటయే సభలో 'తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు' అంశంపై క్రైం అండ్ ఇన్వెస్టిగేషన్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, మంగళగిరి కేజీవీ సరిత ధార్మికోపన్యాసం చేస్తారు. మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ ముకుందరావుకు 'ఆదర్శ దంపతుల పురస్కారం'ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య చేతులమీదుగా బహూకరిస్తారు.

పేదలకు అన్నదానం



తెనాలిరూరల్: సూపర్‌స్టార్ కృష్ణ రెండో వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు పేదలకు అన్నదానం చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితి వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ఆర్కే సెంటర్ కృష్ణ సీనియర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ సీనియర్ అభిమాని కాళిదాసు వెంకట సత్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కృష్ణ అభిమానులు పాల్గొన్నారు. తొలుత కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం తమ చేతుల మీదుగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి, చంద్రశేఖర్, కొత్త శేషుకుమార్, ఆంజనేయులు, తిరుపతయ్య, జాకీర్, పూల బాజి, నాగసరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్



తెనాలిరూరల్: తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణ తొమ్మిదో పారిశుద్ధ్య డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్‌ను శుక్రవారం వేశారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ బీసీజీ టీకా క్షయ వ్యాధి నుంచి రక్షణ కలిగిస్తుందని చెప్పారు. తొమ్మిదో డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ సయ్యద్ నజీర్, సచివాలయం శానిటరీ సెక్రటరీ ఎ. జ్యోత్స్న, శానిటరీ మేస్త్రి రాజేష్, ఏఎన్‌ఎంలు ఎ. పుష్పకుమారి, ఎం. వాణి, ఆశా కార్యకర్త ఆర్. మల్లేశ్వరి, తెనాలి టీబీ సిబ్బంది దిలీప్, భార్గవి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిరూరల్: పట్టణంలోని ప్రతి వార్డుల్లో చేపడుతున్న పరిసరాల శుభ్రత, మురుగు నీరు పారుదల వంటి శానిటేషన్ పనులు విస్తృతం చేసిన పురపాలక సంఘం ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని 11,12 వార్డుల్లోని ప్రతి వీధిలో శుక్రవారం పర్యటించిన చైర్‌పర్సన్, స్పెషల్ డ్రైవ్ పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ కటారి రత్న కుమారి, కటారి హరీష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని రైలు ప్రయాణికుడి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందా డు. పోలీసుల కథ నం మేరకు వివరాలిలా ఉన్నాయి. మోదుకూరు చుండూరు స్టేషన్‌ల మధ్య పట్టాల వెంబడి ప్రయాణికుడు కొన ఊపిరితో ఉండడాన్ని కీ మ్యాన్ గమనించి 108కు సమా చారం అందించాడు. 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యశాల సమీపంలో వాహనంలోనే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని 108 సిబ్బంది వైద్యశాల మార్చురీకి అప్పగించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న కాగితంపై రాసి ఉన్న సెల్ ఆధారంగా అతనిది అస్సాం ప్రాంతం అయి ఉంటుందని భావిస్తున్నారు.

ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన డీపీటీవో



తెనాలిరూరల్: తెనాలి ఆర్టీసీ డిపోను జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) కె. రవికాంత్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిపోలోని గ్యారేజ్‌లో ఆయిల్ విభాగం, టైర్ల విభాగం, స్టోర్‌లను తనిఖీ చేశారు. గ్యారేజ్‌లో సిబ్బందితో సమావేశమై బస్సుల మరమ్మతుల విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. ట్రాఫిక్ విభాగంలో కంట్రోల్ పాయింట్, అర్నింగ్ సెక్షన్ ఇతర విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. శనివారం నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, అందుకు తగ్గట్టుగా సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు ఐదు నిమిషాలకంటే ఎక్కువ సమయం ఆగకూడదన్నారు. అక్టోబర్ నెలలో డిపోలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్ వెంకటేశ్వరమ్మను సత్కరించి అభినందించారు. డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐజే ప్రసాదరావు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ అభిరామ్ నాయక్, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక పౌర్ణమి పూజలు


శ్రీకోదండరామస్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు


నందివెలుగులోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి

తెనాలి: పవిత్ర కార్తికమాసంలో విశేషమైన పౌర్ణమి రోజున పట్టణంలోని శివాలయాలను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు తరలి వెళ్లిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పాత శివాలయంగా ప్రసిద్ధి చెందిన గంగానమ్మపేటలోని చారిత్రక శ్రీ పర్వత వర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. క్యూలైన్లు, ఆలయప్రాంగణం కిక్కిరిశాయి. రామేశ్వరస్వామి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ తోట ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేసిన మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ రమణకుమారి పర్యవేక్షించా రు. మారీసుపేటలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలోనూ భక్తుల రద్దీ కనిపించింది. ఆల యంలో కార్తిక దీపారాధనలు చేశారు.

రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపారాధనలు చేశారు. పినపాడులో పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీగంగాభ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కూడా కార్తిక పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. బ్రహ్మసూత్రం కలిగి ఉన్న శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి వచ్చి దీపారాధనలు చేశారు. శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మారీసుపేట శ్రీకోదండ రామస్వామి ఆలయంలోనూ భక్తులు పంచామృత అభిషేకాలు చేశారు. సుల్తానాబాద్ లోని శివాలయంలో కార్తిక పౌర్ణమి రోజున స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రూరల్ మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామంలోని శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీసంగమేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తిక మాస విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మాణిక్యారావు సిద్దార్థ వెంకట మార్కండేయరావు, కార్యనిర్వహణాధికారి వి.పద్మ పర్యవేక్షించారు. నందివెలుగు గ్రామంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

17న షుగరు, గుండెజబ్బులపై ఉచిత వైద్యశిబిరం


తెనాలి: ప్రపంచ షుగరు వ్యాధి వారోత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని కృష్ణ మెడికేర్‌లో ఈనెల 17వ తేదీన షుగరువ్యాధి, గుండె జబ్బులపై అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయే కార్యక్రమంలో ఉచితంగా షుగర్ పరీక్షలు, ఆరికాళ్లు, నరాల స్పర్శకు చెందిన పరీక్షలను వైబ్రోమీటర్‌తో చేస్తామని ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. షుగరు వ్యాధి ఎందుకు? ఎవరికి వస్తుంది. ఆహార నియమాలు, గుండె, కిడ్నీ సమస్యలు-నివారణ, పదరక్షణ అంశాలపై సినిమా స్లయిడ్స్‌తో ప్రత్యేకంగా అవగాహన కల్పించి, షుగరువ్యాధి పుస్తకలను ఉచితంగా పంపిణీ చేస్తారు. సందేహాలను నివృత్తి చేస్తారు. పట్టణ, పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నప్రసాద వితరణ



తెనాలి: కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక శివాజీ చౌక్‌లోని కాళీమాత దేవస్థానం ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం కమిటి చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు ఈ వితరణ చేశారు. మురళి, దామోదరావు, కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు, కందేపి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ పరిషత్ కార్తిక సమారాధన



తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 17న బోసురోడ్డులోని నూకల రామ కోటేశ్వరరావు కళ్యాణ కళాసదనంలో కార్తిక సమారాధన, పేద విద్యార్థులకు, ఉపకార వేతనాలు ఇవ్వనున్నారు. సమారాధన కరపత్రాన్ని శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. అధ్యక్షుడు కోట పార్థసారిధి, కార్యదర్శి చింతపల్లి సాయికిరణ్ వివరాలను తెలియజేశారు. ఉదయం ఆరు గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకంతో కార్యక్రమాలను ఆరంభిస్తామని తెలిపారు. 9.30 గంటలకు సభాకార్యక్రమం, పరిషత్ మాజీ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తికి సత్కారం, 11 గంటలకు పేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ, అనంతరం కార్తిక సమారాధన జరుగుతాయని వివరించారు. పట్టణ, పరిసర ప్రాంతాల బ్రాహ్మణ బంధుమిత్రులు పాల్గొనాల్సిందిగా కోరారు. కోశాధికారి కామరాజు గడ్డ రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు కాజా శ్రీనివాస్, పులిపాక లక్ష్మణ్ కుమార్, సహాయ కార్యదర్శి, మన్నవ మురళీమోహన్, కార్యవర్గ సభ్యులు జూపూడి ప్రవీణ్, కొండపి శ్రీనివాసరావు. చివుల మౌనిక, కొణిదేన సరళ, మాజీ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, జొన్నలగడ్డ సూర్య భగవాన్ పాల్గొన్నారు.

తెనాలిలో మహిళలకు నైపుణ్య శిక్షణ సంస్థ

ప్రారంభించిన సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ


ప్రారంభిస్తున్న సంజనా సింహ

తెనాలి: పట్టణానికి చెందిన డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ భవనంలో ప్రారంభించిన మహిళల నైపుణ్యాభివృద్ధి సంస్థను శుక్రవారం సాయంత్రం తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ప్రారంభించారు. మహిళలకు ఉపాధిని కల్పించేందుకు శిక్షణ సంస్థల ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. సొసైటీ తరపున నైపుణ్య శిక్షణ సంస్థను ఆరంభించిన డాక్టర్ శారదను అభినందించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద మాట్లాడుతూ, మహిళలు ఉపాధి కల్పనకు అవసరమైన శిక్షణకోసమని ఈ సంస్థను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. తొలిగా సమీపంలోని బుర్రిపాలెం, చక్రాయపాలెం , చదలవాడ గ్రామాలకు చెందిన వందమంది మహిళలకు వారికి ఆసక్తి కలిగిన టైలరింగ్, బుట్టల అల్లకం, డ్రైవింగ్... వారి నైపుణ్యాల ప్రకారం ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

నిత్యావసరాల ధరల భారంపై సీపీఎం ధర్నా

కరెంటు ఛార్జీల భారం మోపుతున్నారని ఆందోళన


ధర్నా చేస్తున్న నాయకులు

తెనాలి: నిత్యావసర వస్తువుల ధరల భారంపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజా పోరు' ప్రచార ఉద్యమం ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు కే.బాబూప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై దేశవ్యాప్తంగా ప్రచార ఉద్యమం చేపట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 8వ తేదీ నుండి తెనాలి లోప్రచార కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మోపిన జీఎస్టీ కారణంగా ప్రతి సరుకు ధర పెరిగిందన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఆకుకూరల, పండ్లు, హోటల్ తినుబండారాల రేట్లు బాగా పెరిగాయని గుర్తుచేశారు. సామాన్య ప్రజలు ఏదీ కొనలేని తినలేని పరిస్థితిలో ఉన్నారని చెబుతూ, అయినా ప్రభుత్వాలకు ఇవేమీ పట్టలేదని విమర్శించారు. ఇసుక ఇప్పటికీ అందుబాటులో లేదని భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా మనకు పెట్రోలు, డీజిల్,గ్యాస్ ధరలు తగ్గనే లేదన్నారు. పైగా ఈ నెల నుంచి విద్యుత్ చార్జీలు యూనిట్ కు 40 పైసలు పెరగబోతున్నాయని, రాబోయే కాలంలో యూనిట్‌కు ఒక రూపాయి పెంచబోతున్నారని హెచ్చరించారు. అవసరం లేని స్మార్ట్ మీటర్లు బిగించి మీటరుకు రూ.13 వేల చొప్పున భారాన్ని ప్రజల నెత్తిన మోపబోతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను నమ్మించి ద్రోహం చేయటమేనని అన్నారు. రైతు సంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంట కాల్వల పూడికలు తీయించాలని పెద వడ్లపూడి హై లెవెల్ ఛానల్ పని పూర్తి చేయాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలి అని కోరారు. జగ్గడిగుంట పాలెం రైతులు పొలాలకు రాకపోకలు చేసేందుకు అనాదిగా ఉన్న రైల్‌గేటును తిరిగి తెరిపించాలని కోరారు. సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కె.రవి కుమార్, పి.జోనేష, ఎం.సాంబ శివ రావు, ఎస్.రాజ్యలక్ష్మీ, వై.ఈశ్వరి, వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ సంఘ నాయకులు జి.శ్రీనివాసరావు, శెట్టి యేశోభు, కె.వెంకట్, పి.దాసు, ఎం.ఆదాం, టి.యేసుపాదం, కుమార్, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎస్.సుబ్ర మణ్యం, జి.రవీంద్ర, కె.దుర్గాప్రసాద్, సంగం డైరీ విశ్రాంత వెంకటేశ్వర్లు, రమణ, దాల్ మిల్ ముఠా వర్కర్లు, బ్రూవరీస్ ముఠా వర్కర్లు పాల్గొన్నారు.

జీవితమనే సినిమాకు ఎవరికివారే హీరోలు

వివేక కల్చలర్ ఫెస్ట్‌లో మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ


తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: జీవితమనే సినిమాకు ఎవరికివారే హీరోలని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి దర్శకుడిగా తీర్చిదిద్దుకుని బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించాలని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు ఆడిటోరియంల్ జరుగుతున్న వివేక కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా శుక్రవారం జరిగిన వేడుకల్లో తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ, లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతర పరిశ్రమతో ఉన్నత శిఖలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు. కొల్లిపర ఏఆర్ఆర్ జూనియర్ కాలేజి కోశాధికారి, శ్రీకళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ సమయపాలనను పాటిస్తూ బాధ్యతతో పనిచేసినపుడే జీవితమనే పరీక్షలోనూ ఉత్తీర్ణులు కాగలరని చెప్పారు. తొలుత వెలగా వెంకటప్పయ్య స్మారక గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను గోపాలకృష్ణ ప్రారంభించారు. వివేక మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణమాచారి, షహనాజ్‌బేగం, ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. శివకుమార్, మురళి, రాంబాబు, రాజేష్, అక్షయ్, వెంకటేశ్‌లు సహకారం అందించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శనలు


పెదరావూరులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెనాలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం స్థానిక గ్రేడ్-1 శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనను తిలకించారు. అనంతరం 'మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు', 'పుస్తక పఠనం ప్రాముఖ్యత'పై విశ్రాంత హెచ్‌ఎం రాయపాటి శివనాగేశ్వరరావు, విశ్రాంత గ్రంథపాలకుడు మొవ్వా సుబ్బారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి కావూరి రమాదేవి పర్యవేక్షించారు.

పెదరావూరులో..

రూరల్ మండల గ్రామం పెదరావూరులోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి కొడాలి చంద్రమౌళి ప్రారంభించారు. ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, విజయనిర్మల, సామ్రాజ్యం, గ్రంథాలయ అధికారి ఎ. రాఘవేంద్ర రావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంగంజాగర్లమూడిలో...

సంగంజాగర్లమూడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ స్పెషల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు షేక్ కాలేషా పుస్తక పఠన ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు పి.నాగలక్ష్మి, ఎస్.సంధ్యారాణి, సంగంజాగర్లమూడి పంచాయతీ పరిధిలోని పాఠశాలల బాలబాలికలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి

ఎంపీపీ పద్మావతి


మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: గ్రామ పంచాయతీల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి 2025-26 ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, నెహ్రూ, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణ తరగతులు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్లపై దృష్టి సారించి గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్లపై దృష్టి సాదించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బార్గవ్, సీనియర్ అసిస్టెంట్ మూర్తి , మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం



తెనాలి: పట్టణ టీబీ రోడ్డులోని నెం.22 ది తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెనాలి డివిజనల్ సహకార అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్ కేవీ రామారావు నూతన కార్యవర్గంచే ప్రమాణం చేయించారు. బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు (హరిబాబు), డైరెక్టర్లుగా దొప్పలపూడి శ్యాంసన్,కొణిదెన నాగేంద్రరావు బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు పర్సన్ ఇన్‌ఛార్జిగా కొనసాగిన కేవీ రామారావును సత్కరించారు. బ్యాంక్ అభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తామని పాలకవర్గ చైర్మన్, డైరెక్టర్లు వెల్లడించారు. బ్యాంక్ ఇన్‌ఛార్జి కార్యదర్శి కేవీవీ అమరనాథ్, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, జొన్నాదుల మహేష్, రంగం భాగ్యరాజ్, చుక్కపల్లి పెదబాబు, కరణం వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మంగమూరి యుగంధర్, షేక్ జిలానీఖాన్, ఫజల్‌ఖాన్, సుంకర హరికృష్ణ, పాల్గొన్నారు.